

నేడు పులివెందులకు వైఎస్.జగన్ రాక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం పులివెందులకు రానున్నట్లు ఆయన ప్రత్యేక కార్యదర్శి నాగేశ్వర రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. బెంగళూరులోని తన నివాసం నుంచి బయలు దేరి 10 గంటలకు బెంగళూరు విమానాశ్రయనికి చేరుకుంటారన్నారు. హెలికాప్టర్ ద్వారా 10:45 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారన్నారు. అనంతరం పట్టణంలోని తన కార్యాలయంలో నిర్వహించే ప్రజా దర్బార్ పాల్గొంటారు.

ఉల్లి రైతులకు కన్నీరే..



అమాంతంగా పడిపోయిన ధరలు | రూ.1500కు తగ్గిన క్వింటా ధర

తడిసిన గడ్డలు రూ.వెయ్యికి కూడా కొనుగోలు చేయని వ్యాపారులు | అమ్మకాల కోసం నానా అవస్థలు

దళారులు, వ్యాపారులదే రాజ్యం | మార్కెట్‌లో ధర బాగున్నా.. రైతులకు మాత్రం మొండిచేయి



మైదుకూరు వద్ద అమ్మకం కోసం సిద్ధం చేసిన ఉల్లిగడ్డలు

ప్రజాశక్తి - చాపాడు

ఆరుగాలం కష్టించి పండించిన పంట అమ్మకం దశకు వచ్చేసరికి ఉల్లి ధరలు అమాంతం తగ్గిపోవడంతో పంట సాగుచేసిన రైతులు అయోమయంలో పడ్డారు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా 20 రోజులుగా ఉల్లి పంట నూర్పిడి చేపడుతున్నారు. దసరా పండుగకు ముందు ఉల్లి పంట నూర్పిడి చేసిన రైతులకు వర్షం దెబ్బ తగిలింది. నూర్పిడి చేసిన తరువాత ధరలు అమాంతం తగ్గడంతో పంట సాగు చేసిన రైతులు నిరాశలో పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో మాత్రం ఉల్లి ధరలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది. కానీ రైతుల విషయానికి వచ్చే సరికి వారికి మొండి చెయ్యి మాత్రమే మిగిలుతోంది. మధ్యలో వ్యాపారులు, దళారులు ప్రవేశించి రైతులకు అన్యాయం చేస్తున్నారు. సెప్టెంబర్ నెల చివరి వారంలో, అక్టోబర్ మెదటి వారంలో ఉల్లి పంట నూర్పిడి చేసిన రైతులు ఉల్లి పంటను క్వింటా రూ.3200కి అమ్మకాలు చేశారు. అక్టోబర్ రెండవ వారంలో క్వింటా ధర రూ.2700, తిరిగి మూడవ వారంలో రూ.3 వేలకు చేరింది. తరువాత క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం క్వింటా రూ.1500కు పడిపోయింది. వర్షానికి తడిసిన గడ్డలు రూ.వెయ్యికి కూడా అడగటం లేదని రైతులు వాపోతున్నారు. చెన్నై, తాడేపల్లిగూడెం మార్కెట్‌కు వెళ్లిన రైతులకు మరింత చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. క్వింటాను రూ.500కు వ్యాపారులు మార్కెట్లో అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. పంట దిగుబడి అమ్మకం కాకపోవడంతో వాటిని మార్కెట్‌కు తరలించేందుకు అదనపు భరించ లేక ఏమిచేయాలో తెలియక రైతులు దిగాలు చెందుతున్నారు. ఇతర ప్రాంతాల మార్కెట్లకు ఉల్లిగడ్డలను తరలించిన రైతులు రోజుల తరబడి అమ్మకాల కోసం ఎదురుచూసి చివరకు దళారులు నిర్ణయించిన ధరకు పంటను అమ్ముకొని నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది ఉల్లికి మంచి ధరలు ఉన్నాయని పది రూపాయలు సంపాదించుకోవచ్చు అనుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. పంటకు నిలకడగా ధరలు లేకపోవడం, స్థానికంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వంటి సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. పంట సాగు చేసే సమయంలో అధిక ధరలు ఉంటూ, చేతికి అంది వచ్చే సమయంలో అమాంతం తగ్గిపోవడంతో ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. మైదుకూరు, చాపాడు, దువ్వూరు మండలాల పరిధిలో వేల ఎకరాలలో ఉల్లి పంటను రైతులు ప్రస్తుతం నూర్పిడి చేస్తున్నారు. సరైన డిమాండ్ లేకపోవడంతో అమ్మకాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోకపోతే రాబోయే రోజుల్లో సాగు ప్రశ్నార్థకంగా మారనుంది.

కౌలుకు తీసుకుని నష్టపోయా..



ఉల్లి పంటను ఎకరా రూ.20 వేలకు కౌలుకు తీసుకుని సాగు చేశాను. సాగు ఖర్చులు ఎకరాకు రూ.80 వేల వరకు అయ్యాయి. ప్రస్తుతం ధరలు చూస్తే దిగుబడి సమయంలో అమాంతం తగ్గిపోయాయి. క్వింటా రూ.1500కు కూడా వ్యాపారులు అడగడం లేదు. ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోవాలి.

- కుమార్, ఉల్లి రైతు, నాగాయపల్లి, దువ్వూరు మండలం.

అమ్మకాల సమయంలో ధరలు తగ్గాయి..



ఉల్లి పంటను సాగు చేసి ప్రస్తుతం అమ్మకం చేసే సమయంలో ధరలు అమాంతం తగ్గాయి. 20 రోజుల కిందట క్వింటా రూ. 3వేలకు కు పైగా ఉన్న ధరలు ప్రస్తుతం రూ.1500కు చేరింది. ఉల్లిగడ్డలు వర్షానికి తడవడంతో వ్యాపారులు ఏమాత్రం అడగడం లేదు. ఇతర ప్రాంతాల్లో మార్కెట్‌కు తరలిస్తామనుకుంటే అక్కడ కూడా పరిస్థితి అధ్వానంగా ఉంది. స్థానికంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

-ప్రతాపరెడ్డి, రైతు ద్వారకానగరం, చాపాడు మండలం.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ ఎదుట ధర్నాలో సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి సుంకర కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరానికి నోచుకోలేదని పేర్కొన్నారు. చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు, డెత్ స్కీం పోస్టులు వారి పిల్లలకు ఉద్యోగాలు, కార్మికులకు ఎఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. అడిషనల్ కార్మికలుకు పని భద్రత కల్పించకపోతే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని చెప్పారు. మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, అదేవిధంగా క్లాప్ డ్రైవర్లకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన పని భద్రత కల్పించాలని పేర్కొన్నారు. నగర విస్తృత పెరిగిందని, కార్మికుల సంఖ్యను పెంచాలని, సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ నగరంలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. కార్మికులను పట్టించుకోకపోగా సెక్రెటరీ వేధింపులు విపరీతంగా ఉన్నాయని పేర్కొన్నారు. నగరంలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ. 21వేలు జీతం చెల్లించాలని తెలిపారు. నీళ్ల, వీధిలైట్లు, నగరాల సుందరీకరణ చేయడంలో వారి పాత్ర గణనీయమైందని చెప్పారు. ప్రభుత్వం వారిని గుర్తించి కనీసం వేతనం ఇవ్వాలని, ఒకే రకమైన వేతనాలు మున్సిపల్ కార్మికులు అందరికి ఇవ్వాలని కోరారు. నగరంలోని క్లాప్ వ్యవస్థలో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీసం పని భద్రత లేకుండా యాజమాన్యం వివరిస్తుందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 36 ప్రకారం 9 మందికి డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 13 మంది డ్రైవర్లను కూడా ప్రమోట్ చేయాలన్నారు. కడప నగరంలో ఉన్న వెహికల్స్ పూర్తి స్థాయిలో అధికారులు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. అరకొర రిపేర్లు చేయించి బయటికి పోవడం వల్ల మళ్ళీ షెడ్డుకు వస్తాయని చెప్పారు. అలా రాకుండా చూడాలని పేర్కొన్నారు. కార్మికులకు అందరికీ భద్రత కల్పించాలని తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే సమ్మెకు పోతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు ఇత్తడి ప్రకాష్, ఆనంద్, నాగరాజు, నరసింహులు, సాయి, నిత్యపూజయ్య, ఆదాము, మస్తాన్, పెద్దోడు, బాలాజీ, రమాదేవి, దస్తగిరిమ్మ, సుంకన్న, నాగయ్య, కార్మికుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిఐటియు నేతలు దాసరి విజయ్, ఏసుదాసు తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపాల్టీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజారోగ్యం, పర్యావరణం, మున్సిపాలిటీ పరిశుభ్రత కోసం పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులతో పాటు పర్మినెంట్ సిబ్బంది, కోవిడ్ కార్మికులు, బదిలీ కార్మికులు, ఎన్ఎంఆర్, క్లాప్ డ్రైవర్లుగా సేవలు చేస్తున్నామన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు, సెలవులు, రక్షణ పరికరాలు, వాహనాల మరమ్మతులు, పనిముట్లు సకాలంలో ఇవ్వడం లేదని వాపోయారు. యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు, టవల్స్ ఇవ్వడంలో జాప్యం చేయడం జరుగుతోందని వాపోయారు. ఇప్పటికైనా 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయక కార్మిక సంఘం నాయకులు, పేదలు

పేదలకు భూపంపిణీ చేయాలి : వ్య.కా.స


ప్రజాశక్తి-అట్లూరు

మండల పరిధిలోని నల్లాయపల్లె, సర్వేనెంబర్ 40లో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంపణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. అన్వేష్ మండల ప్రధాన కార్యదర్శి ఇ. రమణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కమలాకూరు గ్రామం, వలస పాలెంచ కమలకూరు బిసి కాలనీ వాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లయి పల్లె ప్రభుత్వ భూములను పదేళ్ల నుంచి స్థానికులకు టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఇవ్వకుండా అన్యాయం చేశాయని వాపోయారు. భూ పంపిణీ పట్ల నిర్లక్ష్యంగా రెండు ప్రభుత్వాలు వ్యవహరించాయని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా అసైన్మెంట్ కమిటీ ద్వారా భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొందరు కబ్జా దారులు 30 నుంచి 50 ఎకరాల చొప్పున కంచెలు వేసుకుని ఎస్టేట్లుగా ఏర్పాటు చేసుకున్నారని, ఆ భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. లేకపోతే వ్యవ సాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూ పోరాటం నిర్వహిస్తామని తెలిపారు కార్యక్రమంలో గురమ్మ, సుహాసిని, సుసిని సుభద్ర, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

దోమల ఉత్పత్తి కేంద్రంగా బుగ్గవంక

- కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న గౌస్‌పీర్

నగరం నడిబొడ్డున ఉన్న బుగ్గవంక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారి, పరివాహక ప్రాంతాల్లో పగటి పూటే విజృంభిస్తూ ప్రజలకు చుక్కలు చూపెడుతున్నాయని కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బుగ్గవంకలోకి మురుగు నీరు చేరి, కంప చెట్లు, పిచ్చిమొక్కలతో చూడడానికి మురికి కూపంగా ఉందని తెలిపారు. ఒకటే దుర్వాసన, అటుగా వెళ్లాలంటేనే భయంగా ఉందన్నారు. వాపోయారు. ఫలితంగా నగరంలో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాడ్, వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రోజూ ప్రతి డివిజన్‌లో ఫాగింగ్ చేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ అధికారులు వీటిని పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైనా నగరపాలక కమిషనర్, ఆరోగ్య శాఖాధికారి దృష్టి సారించి సంబంధిత అధికారులను ఆదేశించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

వైఎస్.షర్మిలకు వెంటనే భద్రత పెంచాలి



మాట్లాడుతున్న మధురెడ్డి

ప్రజాశక్తి - కడప : పిసిసి అధ్యక్షులు వై.ఎస్. షర్మిలకు వెంటనే భద్రత పెంచాలని కాంగ్రెస్ పార్టీ యువ నేత వెన్నపూస మధురెడ్డి కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన రోజుల్లో అటు సొంత అన్న చేతిలో అవమానాలకు గురై, మీడియా ముఖంగా తన ఆవేదన వ్యక్తం చేస్తుంటే, ఓర్వలేని వైసిపి నాయకులు ఆమెపై ఎదురు దాడికి దిగడం శోచనీయమన్నారు. పైగా సోషల్ మీడియాలో అసభ్య రాతలే కాదు, దారుణమైన హెచ్చరికలు కూడా చేస్తున్నారు అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతల్లో, రాజన్న అభిమానుల్లో షర్మిల భద్రతా పట్ల తీవ్రమైన ఆందోళన నెలకొంది అన్నారు. అందుకే తాము ప్రభుత్వాన్ని ఆమె భద్రత భద్రత మరింత పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అటు సొంత అన్న, వైసీపీ గూండాల వల్ల రక్షణ కరువయ్యే సూచనలు రోజురోజుకి స్పష్టంగా ఉన్నాయని, తమ బండారం బయటపడుతుంటే జగన్, పెటిఎం బ్యాచ్ భయంతో మరిన్ని కుట్రలకు పాల్పడుతారని తెలిపారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - వేంపల్లె



శ్రీనివాసులరెడ్డి (ఫైల్‌ఫొటో)

మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎన్. శ్రీనువాసులు రెడ్డి (47) అనే రైతు అప్పుల బాధతో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు..గ్రామానికి చెందిన నారాయణరెడ్డి కుమారుడు శ్రీనువాసులు రెడ్డికి 10 ఎకరాలు పొలం ఉంది. తన పొలంలో పత్తి, వేరుశనగ పంటలను సాగు చేశారు. అందుకోసం సుమారు రూ. 20 లక్షల వరకు అప్పులు చేశారు. ప్రస్తుతం పత్తి పంట సాగు చేశారు. అప్పుల బాధ తట్టుకోలేక మనస్తాపం చెందడంతో పాటు జీవితం మీద విరక్తి చెంది ఆదివారం రాత్రి తన పొలంలోనే పంటల కోసం తెచ్చిన పురుగుల మందు తాగి ఇంటికొచ్చారు. పురుగుల మందు వాసన రావడంతో కుటుంబ సభ్యులు శ్రీనువాసులురెడ్డిని హుటాహుటినా పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందారు. మృతునికి భార్య శశికళతో పాటు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రామిరెడ్డిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతున్ని భార్య శశికళ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

పాలసీలపై బోనస్ రేట్లు పెంచాలి

ప్రజాశక్తి - కడప సిటీ




నిరసన తెలియజేస్తున్న ఏజెంట్లు, సిబ్బంది

జీవిత బీమాలో పాలసీలపై బోనస్ రేట్లు పెంచాలని, జిఎస్టిఇ తొలగించాలని, రూ.లక్ష పాలసీలను, 55 ఏళ్ల వయసు వరకు పాలసీని కొనసాగించాలని లియాపి 1964 కడప బ్రాంచ్ అధ్యక్షులు రాజోలు, నిత్యానందరెడి, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప ఎల్ఐసి బ్రాంచ్ గేటు వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షులు, నాయకులు మాట్లాడుతూ ఈనెల 14న, 21, ఇప్పుడు బ్రాంచ్ గేటు వద్ద తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేపట్టామని పేర్కొన్నారు. వెంటనే తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ ఈశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ కెవి రమణారెడ్డి, లియాపి నాయకులు జోనల్ ఆర్గనైజర్ సెక్రెటరీ. చంద్రమోహన్ రెడ్డి, డివిజనల్ ఇసి నెంబర్ ఇస్మాయిల్, నాగశివారెడ్డి, వీరభద్రుడు, రాజేంద్ర, కె. వెంకటేశ్వర్లు, మల్లికార్జున, కొరివి శీను, గంగిరెడ్డి, సరోజమ్మ, నాగమణి, సుంకర రామచంద్రుడు, కదిరుల్ల, నరసయ్య, ఎం. పట్టాల నరసయ్య, బ్రాంచ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సమస్యలుంటే డిఎల్ఎస్ఎను సంప్రదించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ (డిఎల్ ఎస్ఎ) ను సంప్రదించాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్ జైళ్లల్లోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జైళ్ల సూపరింటెండెంట్లు, ఖైదీలు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి : ఎంపిడిఒ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : ఉద్యోగులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పని సరిగా వేయాలని ఎంపిడిఒ కుళాయిబాబు పేర్కొన్నారు. రసూల్‌పల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది కచ్చితంగా ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయాలన్నారు. నవంబర్ 1న పింఛన్లను ఉదయం 5 గంటలకే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో మన మండలాన్ని ప్రథమ స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ సచివాలయానికి వచ్చిన ప్రజలతో గౌరవంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. ఆయన వెంట సచివాల సిబ్బంది ఉన్నారు.

నేడు, రేపు డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు మంగళ, బుధవారాల్లో కడప యుటిఎఫ్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. సోమవారం ఆర్‌టిసి బస్టాండ్ వద్దనున్న జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండు రోజులు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి రోజు రాష్ట్ర కమిటీ సమావేశాలు సందర్భంగా కడప ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో విభజన హామీలు, కడప ఉక్కుపరిశ్రమ, కొప్పార్తి పరిశ్రమ కారిడార్ అభివృద్ధిపై సెమినార్ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చిస్తారని చెప్పారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తారని పేర్కొన్నారు. సమావేశాలకు రాష్ట్ర నాయకత్వం అందరూ హాజరు అవుతారన్నారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్,జిల్లా సహాయ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.



రైతు బజార్ పరిసరాలను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

రైతుబజార్‌లో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి - కడప అర్బన్

మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్ మొదటి వార్షికోత్సవ సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో దివాలి విత్ మై భారత్ అనే స్వచ్ఛత ప్రోగ్రాంను కడప రైతు బజార్‌లో నిర్వహించారు. శ్రీ హరి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎష్ ప్రోగ్రామ్ అధికారి గణేష్ తమ వాలంటీర్స్‌తో కలసి రైతు బజార్ పరిసరాల ప్రాంతాలను శుభ్రపరిచే చేశారు. కార్యక్రమంలో రైతు మార్కెట్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, ఐటిఐ విద్యార్థులు, ఎన్‌జిఒలు, కానాల ఈశ్వరయ్య, జూటూరు విజయ్, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్స్ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న వికాస్ హరికృష్ణ

తప్పుడు ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. సోమవారం అక్కాయపల్లి లోని తన సొంత కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు వైసిపి రాజ్యసభ సభ్యులుగా విజయసాయిరెడ్డి నెల్లూరులో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి మతిభ్రమించి జగన్మోహన్ రెడ్డి మెప్పుకోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జగన్మోహన రెడ్డి, షర్మిల మధ్య ఆస్తి గొడవలు రోడ్డున పడటంతో షర్మిల వ్యాఖ్యలను ప్రజలు నమ్ముతున్న తరణంలో అక్రమ ఆస్తులు ఎక్కడ బయటపడతాయి అన్న ఉద్దేశంతో విజయసాయిరెడ్డి వారి తప్పులు కప్పిపుచ్చుకోవడానికి ముఖ్యమంత్రి పైన తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి చనిపోవడానికి కారణం చంద్రబాబు నాయుడు అనడం ఎంతవరకు సబబు అన్నారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసంపేట శివ, పుట్టబోయిన శ్రీనివాసులు, విశ్వనాథ్, అనిల్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర స్మారక పోలీస్ కళ్యాణ మండపంలో పోలీసు, హోం గార్డ్స్, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును సందర్శించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నగరంలో ప్రముఖ ఆస్పత్రులకు చెందిన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం పోలీస్ సంస్మరణ వారోత్సవాలు అక్టోబర్ 21 నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు.



విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న చంద్రఓబుల్‌రెడ్డి, నాయకులు

జెవివి కృషి అభినందనీయం

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయమని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక విద్యార్థుల సృజనాత్మకతను పెంచే విధంగా ఇలాంటి పోటీ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పరీక్షల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వచ్చిన విద్యార్థులందరిని అభినందిస్తూ విజేతలందరికీ మెమోంటోలు తన చేతుల మీదుగా అందజేశారు. పిల్లలు చదువుతోపాటు పెద్దలపట్ల గౌరవంతో ఉండి చెడు వ్యసనాలకు గురికాకుండా భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాక్షించారు. అతిథులు వీర సుదర్శన్ రెడ్డి, లక్ష్మీ రాజా, సునీత మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఒక్క విద్యార్థి విజేతలేనని తెలిపారు. వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, పిల్లల విజయంలో భాగస్వాములేనని పేర్కొన్నారు. పిల్లల్లో నైపుణ్యతను పెంచడం కోసం ఇలాంటి పరీక్షలు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. ఎంపికైన విజేతలు నవంబర్ 9, 10 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి సంబరాలలో రాత పరీక్ష, క్విజ్ ప్రయోగాలు, మీట్ ది సైంటిస్ట్ అంశాలలో మన జిల్లా విద్యార్థులు పాల్గొనే అవకాశం వచ్చిందని జె వి వి రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడి దేవదత్తం పేర్కొన్నారు. 34 సంవత్సరాలుగా జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల మక్కువ పెంచడానికి తోడ్పడే విధంగా రూపొందించిన సైన్స్ సంబరాలను విద్యాశాఖ కూడా ప్రోత్సహిస్తూ ఉందని చెప్పారు. ప్రశ్నాపత్రం ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాలలో అందించామని చెప్పారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజాశక్తి - కడప అర్బన్ : దీపావళి పండుగ సందర్భంగా టపాసులు, ఇతర మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్‌విపిఇఐ కన్సల్టెంట్ ఆఫ్థల్మాలజిస్ట్ డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి సూచించారు. సోమవారం వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రాంగణం లోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్విపిఇఐ) లో నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆమె మాట్లాడారు. కంటికి గాయమయితే చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. కంటిని మృదువుగా కడగాలని, కన్ను నలపకూడదని సూచించారు.టపాకాయలు వెలిగించే సమయంలో కేవలం మందంగా ఉన్న నూలు దుస్తులు ధరించాలని, అన్ని దుస్తులనూ బిగుతుగా ఉండేలా చూసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితిలో కడప ఎల్‌విపిఇఐ 08562350600 / 9515889641 లో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో విఫలం : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య, రక్షణ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు పి వెంకటసుబ్బయ్య కోశాధికారి లక్ష్మీదేవి, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నాయకులు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు అనేక సమస్యలు ఉన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించడంలో జిల్లా అధికారులు, అక్కడ పనిచేసే ప్రిన్సిపల్ చొరవ చూపకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటివరకు శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి వీక్లీ ఆఫ్ కూడా ఇవ్వని పరిస్థితి ఉందని తెలిపారు. జీవో నంబర్ 108 ప్రకారం రూ.14,193 ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం రూ.8వేలు మాత్రమే జీతం ఇస్తున్నారని చెప్పారు. అది కూడా జూన్ నుంచి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ కట్టిన దాఖలాలు లేవని తెలిపారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు పి.పవన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు

పేద ప్రజలకు అన్ని విధాలా ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

పేద ప్రజలకు అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో సిఎం సహాయ నిధి కింద 17 మంది లబ్ధిదారులకు పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన రూ.14.67 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టిఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఈ పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఉంటే వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, నాయకులు బిసి సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బాధితులకు అందజేశారు. మండలంలోని అప్పనపల్లి పంచాయతీ మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన అమ్మక్కకి సంబంధించి రూ.50 వేలు, బోనిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన పుల్లారెడ్డి బాధిత కుటుంబానికి రూ.81 వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవిందరెడ్డి పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి

పలు కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - లింగాల

పెద్ద కుడాల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైసిపి నేతలు సోమవారం టిడిపిలో చేరారు. టిడిపి మండల బాధ్యులు దేవిరెడ్డి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో దేవిరెడ్డి వెంకట నారాయణరెడ్డి, దేవిరెడ్డి శివారెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, సీతారామిరెడ్డి, జగన్మోహనరెడ్డి, బాబురెడ్డి, గంగాధరరెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, ప్రతాప్, బాబు, చక్రి, గణేష్‌తోపాటు పలువురు చేరారు. వీరిని పులివెందుల టిడిపి ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన మహిళలందరికీ దీపావళి కానుక

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ దీపావళి నుంచి ఉచిత వంట గ్యాస్ సిలిండర్లను చంద్రబాబు ప్రభుత్వం సరఫరా చేయడం హర్షణీయమని జిల్లా టిడిపి కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పులివెందుల టిడిపి ఇన్‌చార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డిని జిల్లా కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి కలిసి వేంపల్లె సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. వేంపల్లె పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని బిటెక్ రవిని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా చంద్రబాబు నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని జయరామిరెడ్డి తెలిపారు. పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి బిటెక్ రవి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.



రక్తదానం చేస్తున్న సిఐ జీవన్ గంగానాథ్ బాబు

'రక్తదానం మరొకరికి ప్రాణం పోస్తుంది'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రక్తదానం మరొకరికి ప్రాణం పోస్తుందని డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. ఆమరవీరుల సంస్మరణ దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డిఎస్‌పి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి, అర్బన్ సిఐ జీవన్ గంగానాథ్ బాబు స్వీయ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ సిబ్బంది, అధికారులు, ఇతరులు రక్తదానం చేయడం ఎంత సంతోషంగా ఉందని డిఎస్‌పి తెలిపారు. అనంతరం సిఐలు జీవన్ గంగనాథ్ బాబు, హాజీవల్లి, ఎస్ఐ నారాయణ, సిబ్బంది రక్తదానం చేశారు. ముందుగా కార్యక్రమాన్ని డిఎస్‌పి మురళి నాయక్ ప్రారంభించారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండల పరిధిలోని ఎన్.యర్రబల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్.యర్రబల్లి, గంగాయపల్లె ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాజ్యోతి కార్యక్రమంలో భాగం గా సామగ్రి పంపిణీ చేశారు. అమ్మ సేవాసమితి అధ్యక్షులు వాగ్దాడం శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలన్నారు. గొప్పగా చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చి పాఠాలను శ్రద్ధగా వినాలని సూచించారు. పలకలు, బలపాలు, రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ వంటి విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్ర, ఖాజా హుస్సేన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పద్మజ, వీర భారతి, పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారమేదీ..!

- మండల సమావేశంలో సభ్యులు మండిపాటు

ప్రజాశక్తి - వేంపల్లె

పరిష్కారం కాని సమస్యలపై సమావేశాలు పెట్టి ఏం లాభామని ఎంపిటిసి సభ్యులు అధికారులపై మండిపడ్డారు. స్థానిక వైఎస్‌ఆర్ సభా భవనంలో సోమవారం ఎంపిపి లక్ష్మి గాయత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి కటిక చంద్రశేఖర్ మాట్లాడుతూ గత సమావేశంలో ఫిర్యాదు చేసిన సమస్యలకు అధికారులు పరిష్కారం చూపలేదని పేర్కొన్నారు. ఇందుకు మరి కొందరు సభ్యులు మద్దతు పలికారు. సమస్యలకు పరిష్కార మార్గం చూపితే బాగుంటుందని వాపోయారు. విద్యుత్ సరఫరా లేని కారణంగా పాపాఘ్ని నది నుండి వేంపల్లె వాసులకు తాగునీటిని అందించేందుకు ఆలస్యం అవుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి సభ్యులకు తెలిపారు. విద్యుత్ సరఫరాకు ఎస్టిమేట్ వేయాలని జడ్‌పిటిసి ఎం.రవికుమార్‌రెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కొత్తగా బోర్లు వేయాలని ఎంపిటిసి మణి గోపాల్‌రెడ్డి కోరారు. కొత్తగా వచ్చిన అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని ఎంపిపి లక్ష్మి గాయత్రి, జడ్‌పిటిసి సూచించారు. 15వ ఫైనాన్స్ నిధులను ఎక్కువగా తాగునీటి కోసమే ఖర్చు చేయాలని కోరారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో మెయిన్ గేట్ వద్ద ఉన్న చెత్త కుండీని ఎత్తేసి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకొంటామని ఎంఇఒ స్టాలిన్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి చెప్పారు. ప్రభుత్వ పథకాలను, సబ్సిడీ విత్తనాలను, డ్రిప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ కోరారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున మిట్టపల్లి, కత్తులూరు, ముసల్‌రెడ్డిగారిపల్లె, ఎగువ తువ్వపల్లె పాఠశాలలు మూతపడే స్థితికి వచ్చినట్లు ఎంఇఒ స్టాలిన్ సభ దృష్టికి తెచ్చారు. సిడిపిఒ సునీత మాట్లాడుతూ అంగన్వాడీ భవనాల నిర్మాణానికి నివేదికలు తయారు చేయాలని జడ్‌పిటిసి, ఎంపిపి, ఐసిడిఎస్ అధికారులను కోరారు. జగనన్న కాలనీలో ఇంకా దాదాపు వెయ్యి మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదని హౌసింగ్ అధికారి నవీనేశ్వర్ తెలిపారు. జగనన్న కాలనీ ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లు కనెక్షన్లు ఇవ్వాలని కోరితే డిపాజిట్లు కట్టాలని విద్యుత్ అధికారులు చెబుతున్నట్లు ఎంపిటిసి భారతి సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌అండ్‌బి ఎఇ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రధాన రహదారి రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉపాధి, డ్వాక్రా బ్యాంకు రుణాలు, సివిల్ సప్లయ్ తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఎంపిడిఒ కుళాయమ్మ, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు పద్మా జయలక్ష్మిదేవి, శంకర్‌రెడ్డి, సర్పంచులు మధు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, మండల అధికారులు సంధ్యా, శ్రీనువాసులు, వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమస్యలను అధికారుల దృష్టికి తెస్తున్న ఎంపిటిసి కటిక చంద్రశేఖర్

ఉల్లి రైతులను తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఉల్లి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి కోరారు. కడప రోడ్డులోని తగేండుపల్లె గ్రామ సమీపంలో రైతులు గ్రేడింగ్ చేస్తున్న ఉల్లి పంటను సోమవారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఉల్లి రైతులు రామచంద్ర, బాల గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, హరి, కిట్టయ్యలతో తులసిరెడ్డి పెట్టుబడి, దిగుబడి, ధరలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులు ఎకరాకు రూ.లక్షకు పైగా ఖర్చు చేశారని తెలిపారు. పంట దిగుబడి బాగున్నా ధరలు తగ్గుముఖం పట్టాయని, ఉల్లిని కొనే నాథుడే లేకపోవడం దారుణమన్నారు. ఉల్లిగడ్డలను నిల్వ చేసుకునే అవకాశాలు రైతులకు లేవన్నారు. ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగి క్వింటాలుకు రూ.3000 చొప్పున రైతుల వద్ద నుండి ఉల్లి గడ్డలు కొనాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులతో తులసిరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వేమయ్య, వేమారాజా, బాలం సుబ్బరాయుడు, మహబూబ్ బాషా, వెంకటేష్ , బద్రి, రాజు, రమణ, వినయ్ పాల్గొన్నారు.



ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఎన్.తులసిరెడ్డి

యుసిఐఎల్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - వేముల

70వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా తుమ్మలపల్లెలో ఏర్పాటు చేసిన యుసిఐఎల్‌ను సోమవారం వేముల, లింగాల ఐటిఐ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అత్యంత అధునాతన మైనింగ్, ఖనిజ ధాతువు ప్రాసెసింగ్ పద్ధతులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో యుసిఐఎల్ అధికారులు, ప్రభుత్వ ఐటిఐ కళాశాలల ప్రొఫెసర్లు, విద్యార్థులకు డిఎఇ మెమెంటో, సమాచార బ్రోచర్లను అందజేశారు. యురేనియం ధాతువు తవ్వకాలు, పలు పరికరాలు, యంత్రాల సహాయంతో మిల్లులో తదుపరి ప్రాసెసింగ్ గురించి ప్రాథమిక వివరాలను తెలుసుకోవడం పట్ల విద్యార్థులు చాలా సంతోషించారు. కార్యక్రమంలో ఎంఎస్ రావు, సుమన్ సర్కార్, మోహన్‌రెడ్డి, అమ్జద్ అలీ, ఎల్ కోటేశ్వరరావు, సోంజోయ్ ఛటర్జీ, వాసుదేవ్‌రెడ్డి, రవి, భద్రోదాస్, గౌతం కొల్లూరు, కె నాగరాజు, ఎన్ బాషా, ఎన్‌వి రెడ్డి, బి తారకేశ్వరరావు, యు శంకరయ్య, కెరవీంద్రుడు, వామనమూర్తి, బిగంగాధర్ పాల్గొన్నారు.



వినతిపత్రమిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతిదీవన నిధులు రూ.3,480కోట్లు పెండింగ్‌లో ఉంచిందన్నారు. దీనివల్ల చదువులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు పొందడానికి పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు యూనివర్శిటీల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో.. గత ఫీజులు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని యాజామాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం బకాయిల విడుదల విషయంలో జాప్యం చేస్తోందని, కల్లబొల్లి మాటాలు చెబుతు న్నారని విమర్శించారు. వెంటనే బకాయిలు విడుదల చేయాలని, ఎన్నికల హామీలో భాగంగా తల్లికివందనం ఈ విద్యా సంవత్సరం అమలవుతుందో లేదోననే గందరగోళం నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం తల్లికివందనం పథకం అమలుపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్, సప్తగిరి, సునీల్, జయంత్, వరుణ్ పాల్గొన్నారు.

రెండు రోజుల వర్క్‌షాప్ విజయవంతం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇంజనీరింగ్ విభాగంలో ఆధునిక పరిశోధనలు, సాంకేతిక సమీకరణాలు చర్చించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు డైరెక్టర్ ఎంవిఎస్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. సివిల్ ఇంజనీరింగ్ ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లో సివిల్ ఇంజనీరింగ్ పరిశోధనలో ఆధునికతలు(ఎసిఇఆర్-2024) అనే శీర్షికతో రెండు రోజుల వర్క్‌షాప్ సోమవారంతో విజయవంతంగా ముగిసిందని ఆయన తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిల్లోని ప్రముఖ నిపుణులు, పరి శోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రిమోట్ సెన్సింగ్ జిఐఎస్ సివిల్ ఇంజనీరింగ్‌లో ఎలా ఉపయోగించాలో క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, విద్యార్థుల సంక్షేమ అధికారి వెంకటేష్, హెచ్‌ఒడి ధనుం జయ, కన్వీనర్లు సునీల్ భగత్, సరవన కుమార్, ట్రిపుల్ ఐటిల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలి

ముద్దనూరు : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఎఒ వెంకట కృష్ణారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని ఉప్పలూరు గ్రామంలో సోమవారం ఎఒ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. ఇతర ఉత్పత్తులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ ఆదేశాల ప్రకారం వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు. విత్తన నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల పరిశీలన నిమిత్తం ప్రయోగశాలకు పంపినట్లు ఎఒ తెలిపారు.



ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీనివాసులు

ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కుంచా సోమయ్య రెండో వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని వికలాంగుల సంఘం కార్యాలయంలో ప్లేట్లు, గ్లాసులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుంచా సోమయ్య సేవలు వెలకట్టలేమన్నారు. మంచి మనసున్న వ్యక్తి, మనవతా మూర్తి, స్నేహశీలిగా పేర్కొన్నారు. సోమయ్య సేవలు అమోఘమన్నారు. ఆయన గతంలో స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీలో మెంబర్‌గా కూడా కొనసాగారని తెలిపారు. కార్యక్రమంలో సోమయ్య కుటుంబ సభ్యులు శివ, శేఖర్, హరీష్, ఉమాదేవి, చంద్రిక, శశిలిక పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గండి రోడ్డులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 7,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. సమాచారం మేరకు సోమవారం గండి రోడ్డులోని కారు పార్కింగ్ సమీపంలో జూదం ఆడుతున్న వారిపై సిఐ సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ దాడి చేశారు. వేంపల్లెకు చెందిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పేకాటకు దూరంగా ఉండాలన్నారు.



డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న రైతు నాయకులు

మోటర్ వైర్ల చోరీలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు నియోజకవర్గంలో రెండు నెలలుగా జరుగుతున్న వ్యవసాయ మోటర్ల వైర్ల చోరీలను అరికట్టాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎంవి రమణ కోరారు. రైతు సేవా సమితి నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చొక్కం సంజీవరాయుడు ఆధ్వర్యంలో సోమవారం రైతులతో కలిసి డిఎస్‌పి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గత శుక్రవారం రాత్రి దువ్వూరు మండలం గుడిపాడు, చల్లబసాయపల్లి, మనేరాంపల్లి, నీలాపురం, మూడిళ్లపల్లి గ్రామాల్లో ఒకే రోజు రాత్రి 40 నుంచి 50 మంది రైతుల మోటర్ల వైరు చోరీకి గురైందన్నారు. ప్రతి రైతుకు స్టాటర్, మోటర్‌కు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు ఖర్చవుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్ సుబ్బరాయుడు, మిద్దె వెంకటేష్, మూలే రామాంజనేయరెడ్డి, అభివృద్ధి మండలి నాయకులు గంజికుంట నాగరాజు, కోటయ్యగారి గురప్ప, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సన్నపల్లె గ్రామానికి చెందిన కొండారెడ్డి కుటుంబాన్ని సోమవారం మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి పరామర్శించారు. కొండారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహార సహకార సంఘం మాజీ అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, సర్పంచులు వేణుగోపాల్‌రెడ్డి, మిడుతూరు చంద్ర, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



దుకాణాలు కేటాయిస్తున్న ఆర్‌డిఒ భానుశ్రీ

లక్కీ డిప్ ద్వారా దుకాణాలు కేటాయింపు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు లక్కీ డ్రా వేశారు. ఆ మేరకు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో లైసెన్స్ పొందిన 28 మందికి ఆర్‌డిఒ భానుశ్రీ సమక్షంలో లక్కీ డ్రా వేసి, షాపులను కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను లైసెన్స్ దుకాణదారులు తప్పక పాటించాలని సూచించారు. షాపుల మధ్య దూరం ఉండాలన్నారు. తహశీల్దార్ నజీర్ అహ్మద్, దుకాణదారులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని రైతులు సాగు చేసిన పంటలకు ప్రీమియం చెల్లించాలని ఎఒ రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నప్పుడు బీమా ఉపయోగపడు తుందన్నారు. 2024-25, 2025-26 సంవత్సరాలకుగానూ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం ప్రవేశపెట్టిందన్నారు. వరి పంటకు డిసెంబర్ 15లోపు, మిగిలిన పంటలకు డిసెంబర్ 31 లోపు ప్రీమియం రైతులు చెల్లించాలని కోరారు. పంటలకు బీమా వర్తించాలంటే రైతులు ఇ పంట కింద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లకు ఒకేసారి బీమా కింద శనగ, వరి, జొన్న, పెసర, మినుము, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను ప్రకటించిందని చెప్పారు. ప్రీమియం చెల్లించేందుకు ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఇఫ్కో టోకియో సంస్థలను ఎంపిక చేసినట్లు తెలిపారు. బీమా కింద ఎంపిక చేసిన పంటలను మూడు రకాల యూనిట్లుగా ఎంపిక చేశారని వివరించారు. శనగ గ్రామ యూనిట్, వరి, జొన్న, మినుము, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు మండల యూనిట్ కింద, జిల్లా యూనిట్ కింద కేవ లం పెసరను మాత్రమే ఎంపిక చేశారని తెలిపారు. పంటలకు ప్రీమియం రైతు లే చెల్లించాలని చెప్పారు. బ్యాంకులో రుణం తీసుకున్న రైతులకు బ్యాంకులే రుణంలో మినహాయించుకుంటాయని తెలిపారు. రుణం తీసుకోని వారు మీ సేవ కేంద్రాల్లో తమ ఖాతాలున్న బ్యాంకుల్లో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. హెక్టార్ (రెండున్నర ఎకరా) శనగ పంటకు రూ.1,200, వరి పంటకు రూ. 1,575, జొన్న పంటకు రూ.787.50, పెసరకు రూ.675, మినుముకు రూ. 712.50, వేరుశనగ పంటకు రూ.1,200, నువ్వు పంటకు రూ.450, పొద్దు తిరుగుడు పంటకు రూ.750 రైతులు ప్రీమియంగా చెల్లించాలని ఎఒ వివరించారు.